క్లుప్తంగా

ఘనంగా మిలాద్ ఉన్ నబీ


ర్యాలీలో పాల్గొన్న రోజా దర్గా పీఠాధిపతి, ముస్లింలు

కర్నూలు(అర్బన్): నగరంలోని ప్రసిద్ధ రోజా దర్గాలో మహమ్మద్ ప్రవక్త జన్మదినం పురస్కరించుకొని మిలాద్ ఉన్ నబీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మత పెద్దలతో పాటు ముస్లింలు ర్యాలీ నిర్వహించారు. రోజా దర్గా పీఠాధిపతి సయ్యద్ దాదా బాషా సాహెబ్, హజ్ కమిటీ రాష్ట్ర డైరెక్టర్ సూరి మన్సూర్ అలీఖాన్ మాట్లాడుతూ.. మహమ్మద్ ప్రవక్త జీవితం నేటి యుగానికి ఆదర్శమన్నారు. ప్రతి ఒక్కరూ స్నేహ పూర్వకంగా ఉండాలని ప్రవక్త బోధించారన్నారు. ఇతరులకు సాయం చేయడంతో పాటు తమ సంపాదనలో కొంత మొత్తాన్ని సేవా కార్యక్రమాలకు వెచ్చించినప్పుడే మహమ్మద్ ప్రవక్త ప్రేమను పొందుతామన్నారు.

ముమ్మరంగా సంతకాల సేకరణ


జెడ్పీలో సంతకాలు సేకరిస్తున్న సమితి నేతలు

కర్నూలు(అర్బన్): కర్నూలు జిల్లాకు స్వర్గీయ దామోదరం సంజీవయ్య పేరును పెట్టాలని చేపట్టిన సంతకాల సేకరణ ఉద్యమం ముమ్మరంగా సాగుతోందని జిల్లా సాధన సమితి గౌరవాధ్యక్షుడు నక్కలమిట్ట శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం మిలాద్ ఉన్ నబీ పర్వదినంతో పాటు సీపీఐ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి సంస్మరణ సభ జరుగుతున్న నేపథ్యంలో రాజ్‌విహార్, జిల్లా పరిషత్ ప్రాంగణంలో ముస్లింలు, వివిధ రాజకీయ, వామపక్ష పార్టీలకు చెందిన నాయకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. సాధన సమితి ఆధ్వర్యంలో ఆయా ప్రాంతాల్లో కరపత్రాలు పంచుతూ సంతకాల సేకరణ చేపట్టారు. ఎస్సీ, ఎస్టీ లాయర్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు వై.జయరాజ్ ఉద్యమానికి మద్దతు తెలియజేశారు. సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి రామశేషయ్య, కన్వీనర్ జేవీ కృష్ణయ్య, సలహాదారులు, తదితరులు పాల్గొన్నారు.

ట్రంప్ సుంకాలపై నేడు నిరసనలు

కర్నూలు(సెంట్రల్): భారతీయ ఉత్పత్తులపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధిస్తున్న టారిఫ్‌లకు వ్యతిరేకంగా శనివారం అన్ని పట్టణాలు, మండల కేంద్రాల్లో నిరసన ప్రదర్శనలు చేపట్టనున్నట్లు సీపీఎం, సీపీఐ జిల్లా కార్యదర్శులు డి.గౌస్‌దేశాయ్, బి.గిడ్డయ్య శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అమెరికా అధ్యక్షుడు ఇష్టం వచ్చినట్లు టారిఫ్‌లు పెంచుతున్నా భారత ప్రధానమంత్రికి చీమ కుట్టినట్‌లెన్నా లేదన్నారు. ట్రంప్ విధానాలపై బీజేపీ ఎందుకు మాట్లాడడం లేదని, ఏపీకి చెందిన ఆక్వా రంగ రైతులు ట్రంప్ విధానాలతో తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే నిరసన ప్రదర్శనలకు దిగుతున్నామని, అన్ని వర్గాల ప్రజలు మద్దతు తెలపాలని కోరారు.

26 మంది ఉల్లి వ్యాపారుల లైసెన్స్ రద్దు

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ కమిటీ నుంచి ఉల్లిగడ్డల కొనుగోలు లైసెన్స్‌లు పొంది కీలకమైన సమయంలో కొనుగోలు చేయకుండా ధరల పతనానికి కారణమైన వ్యాపారుల లైసెన్స్‌లను రద్దు చేస్తూ చైర్మన్ గోల్కొండ అజ్మత్‌బీ ఉత్తర్వులు జారీ చేశారు. మార్కెట్ కమిటీ నుంచి 36 మంది వ్యాపారులు ఉల్లిగడ్డల కొనుగోలుకు లైసెన్స్‌లు పొందారు. వారిలో 26 మంది ఆగస్టులో మార్కెట్‌కు వచ్చిన ఉల్లిని కొనుగోలు చేయలేదు. దీంతో వ్యాపారుల మధ్య పోటీ తగ్గిపోవడం వల్ల ధరలు పడిపోయాయి. ఈ వ్యవహారంపై మార్కెటింగ్ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు 26 మంది వ్యాపారుల లైసెన్స్‌లను రద్దు చేశారు.

సేవలతోనే పీఈటీలకు గుర్తింపు

కర్నూలు (టౌన్): క్రీడాకారుల అభ్యున్నతికి సేవలందిస్తూ పీఈటీలు గుర్తింపు తెచ్చుకోవాలని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్ సూచించారు. శుక్రవారం స్థానిక కర్నూలు క్లబ్‌లో జిల్లా ఒలింపిక్ సంఘం ఆధ్వర్యంలో ఉత్తమ వ్యాయామ ఉపాధ్యాయలకు అవార్డుల ప్రదానం చేశారు. పీఈటీలు విజయభాస్కర్ రెడ్డి, మహబూబ్ సుభానీ, విజయ జ్యోతి, పద్మలత, లక్ష్మయ్య, చంద్రశేఖర్, నాగన్న, వెంకట్ ప్రతాప్‌లకు అవార్డులతో పాటు శాలువాలు కప్పి పూలదండలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఒలంపిక్ సంఘం అధ్యక్షుడు రామాంజనేయులు, ఢిల్లీ పబ్లిక్ స్కూల్ చైర్మన్ కేజే రెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

7న ఎల్లమ్మ ఆలయం మూసివేత

కర్నూలు (రూరల్): చంద్ర గ్రహణం కారణంగా ఈ నెల 7వ తేదీన వెంకాయపల్లె ఎల్లమ్మ ఆలయం తలుపులు మూసివేయనున్నట్లు శుక్రవారం ఈఓ ఎస్.రాధాకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 7న ఆదివారం రాహు గ్రహ సంపూర్ణ చంద్ర గ్రహణం కారణంగా మధ్యాహ్నం 12 నుంచి అమ్మవారి ఆలయ తలుపులు మూసివేయనున్నట్లు పేర్కొన్నారు. గ్రహణం వీడిన తర్వాత 8న సోమవారం తెల్లవారుజామున 5 గంటలకు ఆలయం తలుపులు తెరిచి ఆలయ శుద్ధి, సంప్రోక్షణ, ప్రాతఃకాల పూజలు నిర్వహించిన అనంతరం అమ్మవారి దర్శనానికి భక్తులను అనుమతించడం జరుగుతుందని వెల్లడించారు.


నిమజ్జనానికి తరలుతున్న వినాయకులు


ఆకట్టుకుంటున్న గణపతి విగ్రహం


గణేశుడిని నిమజ్జనానికి తీసుకొస్తున్న యువత


కేసీ కెనాల్‌లో భారీ వినాయకుడిని నిమజ్జనం చేస్తున్న భక్తులు

ప్రశాంతంగా వినాయక నిమజ్జనం

కర్నూలు కల్చరల్: కర్నూలు నగరంలో గణేష్ నిమజ్జనోత్సవం ప్రశాంతంగా ముగిసింది. వినాయక ఘాట్ కేసీ కెనాల్‌లో గురువారం సాయంత్రం 4 గంటలకు ప్రారంభమైన గణనాథుల విగ్రహాల నిమజ్జన వేడుక శుక్రవారం ఉదయం 11.30 గంటలకు వరకు నిర్విఘ్నంగా కొనసాగింది. అత్యంత భారీ గణనాథులను ప్రతిష్ఠించడంతో వాటిని తరలించడంలో కొంత జాప్యం కావడం.. వినాయక విగ్రహాల శోభాయాత్రలో అధికంగా డీజేలు ఏర్పాటు చేసుకోవడం, సందడి చేసుకుంటూ రావడంతో నిర్దేశించిన సమయానికి విగ్రహాల వాహనాలు ముందుకు కదలకపోవడంతో నిమజ్జనం నెమ్మదిగా జరిగింది. పలు ప్రాంతాల్లో వినాయక విగ్రహాల వాహనాలు కదలి రాకపోవడంతో పోలీసులు జోక్యం చేసుకొని వాటిని తీసుకురావాల్సి వచ్చింది. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన పరిపాలనా వినాయక విగ్రహంతో ప్రారంభమైన నిమజ్జన కార్యక్రమం చివరగా నాగిరెడ్డి రెవెన్యూ కాలనీ భరతమాత ఆలయంలో వీహెచ్‌పీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విగ్రహానికి శ్రీ గణేశ్ మహోత్సవ కేంద్ర సమితి జిల్లా అధ్యక్షుడు బి.వేణుగోపాల్, సభ్యులు గోరంట్ల రమణ, ఎం.నాగ ఫణి శాస్త్రి, రంగస్వామి, గిరిరాజ వర్మ, వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు టీసీ మద్దిలేటి, ఉత్సవ సమితి సభ్యులు సుబ్రహ్మణ్యం, భాను ప్రకాష్, కాశీ విశ్వనాథ్, ఈపూరి నాగరాజు, భజరంగ్‌దళ్ నాయకులు ప్రతాప్‌రెడ్డితో పాటు వివిధ శాఖల ఉద్యోగులు, సిబ్బంది పూజలు నిర్వహించి నిమజ్జనం చేశారు. జాతీయ గీతం, శాంతి మంత్రంతో వేడుకలను ముగించారు. ఈ సందర్భంగా వేణుగోపాల్, నాగ ఫణిశాస్త్రి మాట్లాడుతూ.. నిమజ్జన వేడుక ప్రశాంతంగా ముగిసిందన్నారు. సుమారు 1700 పైగా విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు గంగపుత్ర, బీజేపీ, ఏబీవీపీ, వీహెచ్‌పీ, ఆర్‌ఎస్‌ఎస్, వాసవీ సేవాదల్ తదితర స్వచ్ఛంద సేవా సంస్థలకు చెందిన సుమారు రెండు వేల మంది సేవకులు, పోలీసులు బందోబస్తు నిర్వహించి ఉత్సవం విజయవంతానికి సహకరించారన్నారు. హిందువులందరూ సంఘటితమయ్యేలా ఉత్సవాలు విజయవంతం అయ్యాయన్నారు. కార్యక్రమం విజయవంతం చేయడంలో సహకరించిన అన్ని ప్రభుత్వ శాఖల యంత్రాంగం, పాత్రికేయులు, సామాజిక కార్యకర్తలు, ప్రభుత్వేతర సంస్థల ప్రతినిధులకు గణేష్ మహోత్సవ కేంద్ర సమితి కృతజ్ఞతలు తెలుపుతోందన్నారు. విశ్రాంత అధ్యాపకులు చంద్రశేఖర శర్మ, గైరబోని వెంకటరాముడు వ్యాఖ్యాతలుగా వ్యవహరించారు.


కేసీ కెనాల్‌లో భారీ వినాయకుడిని క్రేన్ ద్వారా నిమజ్జనం చేస్తున్న దృశ్యం


భారీ వినాయకుడిని నిమజ్జనం చేస్తున్న భక్తులు


గంగ ఒడికి చేరుతున్న గణనాథుడు


నిమజ్జనానికి తరలుతున్న వినాయకులు


నిమజ్జనానికి ట్రాక్టర్లపై తరలుతున్న భారీ వినాయకులు


కేసీ కెనాల్ వినాయక ఘాట్ వద్ద నిమజ్జనోత్సవం

ప్రభుత్వాస్పత్రి, కేఎంసీ అభివృద్ధికి చర్యలు


మాట్లాడుతున్న మంత్రి టీజీ భరత్

కర్నూలు(హాస్పిటల్): ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి అన్ని సౌకర్యాలు సవ్యంగా ఉండాలని మంత్రి టీజీ భరత్ సూచించారు. శుక్రవారం సాయంత్రం మెడికల్ కాలేజీ కాన్ఫరెన్స్ హాల్‌లో మంత్రి ఆసుపత్రి, మెడికల్ కాలేజీ అభివృద్ధిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఆసుపత్రిలోని సీటీ స్కాన్‌ను పీపీపీ మెయింటెనెన్స్‌కు ఇవ్వాలని, ఇప్పుడున్న 135 సీసీ టీవీ కెమెరాలకు అదనంగా అవసరమైన చోట కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ రోగులకు మందులు బయటికి రాయవద్దన్నారు. ఆసుపత్రి, మెడికల్ కాలేజీ, హాస్టల్ వద్ద ఉన్న కుక్కలకు స్టెరిలైజేషన్ ఆపరేషన్లు చేయించి వాటిని బయట వదిలిపెట్టాలని మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ విశ్వేశ్వరరెడ్డిని ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి రావలసిన రూ.80 కోట్లకు అవసరమైన యుటిలైజేషన్ సర్టిఫికెట్లు ఇచ్చే చర్యలు వెంటనే చేపట్టాలని, సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని క్యాన్సర్ ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రకాష్‌ను ఆదేశించారు. అంతకుముందు పుల్లారెడ్డి డెంటల్ కాలేజీ వారు మంత్రి చేతుల మీదుగా రూ.80 వేలు విలువైన 10 స్ట్రెచర్లను అస్పత్రికి అందజేశారు. సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు, కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టి నరసమ్మ, వైద్యాధికారులు వెంకటేశ్వర్లు, ప్రకాష్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

● కేసీ కెనాల్‌లో దూకి వ్యక్తి ఆత్మహత్య


లభ్యమైన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

కర్నూలు: మద్యం మత్తులో కేసీ కెనాల్‌లో దూకి 45 ఏళ్ల వయస్సు గల వ్యక్తి మృతిచెందాడు. వినాయక ఘాట్ సమీపంలోని గ్రీన్ పార్కు బార్ వద్ద శుక్రవారం సాయంత్రం 6 గంటల సమయంలో మద్యం మత్తులో ఓ వ్యక్తి కేసీ కెనాల్‌లోకి దూకాడు. స్థానికులు కాపాడే ప్రయత్నం చేశారు. అయితే నీళ్లలో మునిగిపోవడంతో పోలీసులకు సమాచారమిచ్చారు. మూడో పట్టణ ఏఎస్‌ఐ ఓబులేసు అక్కడికి చేరుకుని నీటిలో మునిగిపోయిన మృతదేహాన్ని యువకుల సహాయంతో వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రిలోని మార్చురీ కేంద్రానికి తరలించి భద్రపరిచారు. మృతుడు 5.2 అడుగుల ఎత్తు, ఛామన ఛాయ వర్ణం కలిగి ఉన్నాడు. అతనికి సంబంధించి ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో గుర్తు తెలియని మృతదేహం కింద కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

● మహిళ మృతదేహం వెలికితీత


గుర్తు తెలియని మహిళ మృతదేహం

కర్నూలు: కేసీ కెనాల్‌లో కొట్టుకుపోతున్న మహిళ మృతదేహాన్ని స్థానికుల సాయంతో పోలీసులు వెలికితీసి ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీ కేంద్రంలో భద్రపరిచారు. కెనాల్ పైభాగం నుంచి మృతదేహం నీటిలో కొట్టుకుపోతుండగా గణేష్ నగర్ శివాలయం వద్ద స్థానికులు గమనించి పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు అక్కడికి చేరుకుని కాలువ నుంచి మృతదేహాన్ని వెలికితీశారు. మృతురాలికి సంబంధించి ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి భద్రపరిచారు. సుమారు 40 ఏళ్ల వయస్సు ఉండి 4.5 అడుగుల ఎత్తు, నల్లని వెంట్రుకలు ఉన్నాయి. పసుపు రంగు చీర, ఆకు పచ్చ కలర్ జాకెట్ ధరించింది. ఆచూకీ తెలిసినవారు 94404 20901 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలని ఏఎస్‌ఐ ఓబులేసు కోరారు.

రైతులకు పూర్తి స్థాయి పరిహారమివ్వాలి


మాట్లాడుతున్న గౌస్ దేశాయ్

ఓర్వకల్లు: ఏపీఐఐసీలో భూములు కోల్పోయిన రైతులకు పూర్తి స్థాయి నష్టపరిహారమివ్వాలని సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి గౌస్ దేశాయ్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో బాధిత రైతులతో సమావేశం నిర్వహించారు. సీపీఎం మండల కార్యదర్శి నాగన్న అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో గౌస్ దేశాయ్ మాట్లాడుతూ ఏపీఐఐసీ పేరుతో మండలంలో వేల ఎకరాల భూములను పరిశ్రమల స్థాపనకు తీసుకున్నారన్నారు. అయితే, బాధిత రైతులకు నామమాత్రపు పరిహారం చెల్లించారన్నారు. భూసేకరణ సమయంలో మీ పిల్లలకు ఉద్యోగాలు వస్తాయని, భవిష్యత్ బాగుంటుందని నమ్మబలికి మోసం చేశారన్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి ఏపీఐఐసీలో కోల్పోయిన రైతులకు ఎవరెవరికీ ఎంత పరిహారం వచ్చిందనే కోణంలో విచారణ జరిపి, అన్యాయం జరిగిన వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో బాధిత రైతులను కూడగట్టి పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. సమావేశంలో కేవీపీఎస్ నాయకులు మద్దిలేటి, రామకృష్ణ, అన్నయ్య, కృష్ణుడు, మద్దిలేటి, బాధిత రైతులు, మహిళ రైతులు పాల్గొన్నారు.


మంత్రి, కమిషనర్ చెప్పినా తీరని సమస్య



మడుగులో ఇబ్బందులు పడుతూ వాహనదారుల రాకపోకలు, పనిచేయని మోటార్

కర్నూలు (టౌన్): బిర్లా అండర్ బ్రిడ్జి కింద నిత్యం నీటి మడుగే. చిన్నపాటి వర్షం వచ్చినా పాదచారులు, వాహనదారులు, ఆటోలు, ఇలా.. ప్రతి ఒక్కరు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. స్థానికులు మున్సిపల్ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోకపోవడంతో మంత్రి టీజీ భరత్ దృష్టికి తెచ్చారు. ఆయన ఆదేశాలతో మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులు హడావుడి చేశారు గానీ సమస్య పరిష్కరించలేదు. నాలుగు రోజుల క్రితం టీజీవీ కళా క్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య ఆ దారిలో ఇంటికి వెళుతూ అండర్ బ్రిడ్జి వద్ద నీళ్లలో పడిపోయారు. అక్కడి సమస్యపై నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్‌కు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేశారు. స్పందించిన కమిషనర్ బ్రిడ్జి వద్ద విద్యుత్ మోటారు వేయించారు. స్విచ్ వేస్తే బ్రిడ్జి కింద ఉన్న మురుగు కాల్వలోకి వెళ్లే విధంగా మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులు చర్యలు తీసుకున్నారు. ఏర్పాటు చేసిన రెండవ రోజే మోటార్ చెడిపోయింది. అధికారులకు ఫిర్యాదు చేస్తే రిపేరు చేస్తామని చెప్పారు కానీ ఇప్పటివరకు పత్తా లేరు. అంతకుముందు పక్కనున్న కాల్వ నుంచి మురుగు, వర్షపు నీరు వస్తోందని కాల్వను డైవర్ట్ చేస్తే సమస్య ఉండదని ఐదు నెలల క్రితం అప్పటి కమిషనర్ రవీంద్రబాబు రూ.10 లక్షలు ఖర్చు చేయించి సీసీ కాల్వను మళ్లించారు. అయినా సమస్య పరిష్కారం కాలేదు. తాజాగా మోటారు ఏర్పాటు చేస్తే అదీ చెడిపోయింది. ఇదీ నగరపాలక అధికారుల పనితీరు. ఇప్పటికైనా సమస్య పరిష్కారానికి పకడ్బందీ చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

● కలెక్టరేట్‌లో
స్వచ్ఛత ఏదీ?


కలెక్టరేట్‌లో వీధికుక్కల స్వైర విహారం

కర్నూలు(అగ్రికల్చర్): స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛ భారత్ కార్యక్రమాల పేరుతో హడావుడి చేస్తున్న జిల్లా యంత్రాంగం కలెక్టరేట్ స్వచ్ఛతపై దృష్టి సారించడం లేదు. కలెక్టరేట్‌లో నిత్యం వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. ఎక్కడబడితే అక్కడ మల విసర్జన చేస్తుండటం వల్ల ఇటు అధికారులు, కార్యాలయానికి వచ్చే వారు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. కలెక్టర్, జేసీ, డీఆర్‌ఓలతో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు కొలువుండే కలెక్టరేట్‌లో స్వచ్ఛతపై దృష్టి సారించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. టాయ్‌లెట్స్ కంపు కొడుతున్నాయి. రన్నింగ్ వాటర్ లేకపోవడం, మెయింటెనెన్స్ లేకపోవడం వల్ల మరుగు దొడ్లు అస్తవ్యస్తంగా మారాయి. వ్యవసాయ శాఖ, జిల్లా నీటియాజమాన్య సంస్థలకు చెందిన టాయ్‌లెట్స్ శిథిలావస్థకు చేరాయి. చుక్కనీరు లేదు. అయినా ముక్కు మూసుకొని వినియోగిస్తున్నారు. కంపు భరించలేక ఉద్యోగులు అల్లాడుతున్నారు. జిల్లా అంతట స్వచ్ఛత అనే పదం మారుమోగుతున్నా కలెక్టరేట్‌లో మాత్రం దాన్ని పట్టించుకునేవారు లేరనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పోరాటాలతోనే సమస్యల పరిష్కారం


ఎమ్మార్పీఎస్ జెండావిష్కరిస్తున్న రాష్ట్ర నాయకుడు ఆంధ్రయ్య

కోడుమూరు రూరల్: పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారమవుతాయని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు ఆంధ్రయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని క్రిష్ణాపురం గ్రామంలో ఎమ్మార్పీఎస్ జెండావిష్కరణ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఆంధ్రయ్య మాట్లాడుతూ.. ఎమ్మార్పీఎస్ 30 సంవత్సరాల పోరాటంలో ఎంతో మంది బలిదానాలు, ఆత్మహత్యలు, నిర్బంధాల నడుమ ఎస్సీ వర్గీకరణ సాధించుకోవడం జరిగిందన్నారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు సప్పాగు నాగేష్, నాయకులు పాల్గొన్నారు.

జ్ఞానం వైపు నడిపించేవారే గురువులు

అజ్ఞానం అనే అంధకారాన్ని తొలగించి జ్ఞానం వైపు నడిపించే వారే గురువులని వక్తలు కొనియాడారు. గురుపూజోత్సవం కార్యక్రమాన్ని శుక్రవారం జిల్లాలో ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయుడిగా ప్రస్థానం మొదలు పెట్టి రాష్ట్రపతి స్థాయికి ఎదిగిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీనియర్ అధ్యాపకులను ఘనంగా సన్మానించి వారి సేవలను కొనియాడారు. – సాక్షి నెట్‌వర్క్



ఉపాధ్యాయ దినోత్సవంలో పాల్గొన్న రిటైర్డ్ టీచర్లు, లెక్చరర్లు, ఉర్దూ వర్సిటీలో రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న దృశ్యం


రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పీఆర్‌టీయూ నాయకులు


రజక ఉపాధ్యాయులను సన్మానించిన సేవా సమితి నేతలు


ఆర్‌యూలో రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న వీసీ వెంకట బసవరావు, తదితరులు